సాక్షి అన్నమయ్య జిల్లా

శుక్రవారం । 22 । నవంబర్ । 2024



రూ.20 లక్షల నగదు, నగలు చోరీ

మదనపల్లె-అంగళ్లు మార్గమధ్యంలోని గౌనివారిపల్లెలో బంగారు నగలు, రూ. 10 లక్షల నగదు చోరీకి గురయ్యాయి. -8లో



యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

ఒంటిమిట్ట మండలం గొల్లపల్లి ఇసుక క్వారీలో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.290	రూ.360
రెండోరకం	రూ.200	రూ.280

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 270 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

పదవ తరగతి పరీక్షల ఫీజు గడువు పొడిగింపు

రాయచోటి (జగదాంబసెంటర్) : అన్నమయ్య జిల్లాలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి ఫీజు గడువును ప్రభుత్వం ఈ నెల 26వ తేదీ వరకు పెంచిందని అన్నమయ్య జిల్లా విద్యాశాఖాధికారి కె.సుబ్రమణ్యం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు. ఇప్పటికే పదో తరగతి పబ్లిక్ పరీక్షల షెడ్యూల్‌ను ప్రభుత్వం విడుదల చేసిందని, అదే విధంగా రెండు పర్యాయాలు పరీక్షా రుసుము చెల్లించుటకు తేదీలను కూడా ప్రభుత్వం మార్చిందన్నారు. అపరాధ రుసుము లేకుండా ఈనెల 26వ తేదీలోగా పాఠశాల లాగిన్ ద్వారా www.bse.ap.gov.in అనే వెబ్‌సైట్‌లో ఎన్ఆర్, అదనపు పత్రాలు సబ్‌మిట్ చేయాలని డీఈఓ తెలియజేశారు.

24న క్రీడాపోటీలు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని డీఎస్ఏ క్రీడా మైదానంలో ఈనెల 24వ తేదీన ఇషా ఫౌండేషన్ గ్రామోత్సవ వేడుకల్లో భాగంగా పురుషుల వాలీబాల్ క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు డీఎస్‌డీఓ కె. జగన్నాథరెడ్డి తెలిపారు. పోటీల్లో విజేతలకు నగదు ప్రోత్సాహకరాలు అందించనున్నట్లు చెప్పారు. పూర్తి వివరాలకు డీఎస్ఏ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

ముగిసిన పెద్దదర్గా ఉరుసు



ప్రార్థనల్లో పాల్గొన్న దండు వీరయ్య మాదిగ తదితరులు

కడప కల్చరల్ : ప్రముఖ ఆధ్యాత్మిక, సూఫీ క్షేత్రమైన కడప అమీన్‌పీర్ (పెద్ద) దర్గా ప్రధాన ఉరుసు ఉత్సవాలు గురువారం ముగిశాయి. బుధవారం రాత్రి ప్రారంభమైన దర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్ నగరోత్సవం తెల్లవారుజాము వరకు కొనసాగింది. అనంతరం దర్గాలో ప్రముఖ గాయకులతో ఖవ్వాలీ కచేరి నిర్వహించారు. గురువారం ఉత్సవాలకు విచ్చేసిన భక్తులకు బండారు ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తుల సమస్యలను పీఠాధిపతి ప్రత్యేకంగా ఆలకించి పరిష్కారాలు సూచించారు. వారు తిరిగి తమ ప్రాంతాలకు వెళ్లేందుకు అనుమతులు మంజూరు చేశారు. పెద్ద ఉరుసుఉత్సవాలు వారం రోజులపాటు ఘనంగా నిర్వహించేందుకు సహకరించిన అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది, భక్తులకు ఆయన అభినందించారు. ఉత్సవాలు ముగిసినట్లు అధికారికంగా ప్రకటించారు.

పెద్దదర్గాలో ప్రముఖుల ప్రార్థనలు

కడప అమీన్‌పీర్ దర్గాకు నేడు కూడా భక్తులు, అతిథుల రాక కొనసాగింది. గురువారం కూడా భక్తులు విశేష సంఖ్యలో ప్రధాన గురువుల మజార్లను దర్శించుకుని ప్రార్థనలు చేశారు. ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు దండు వీరయ్య మాదిగ, సతీమణి నారాయణమ్మ, నాయకులు ప్రార్థనలు నిర్వహించారు.

పనివేళల పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి



సభ్యత్వ నమోదులో పాల్గొన్న ఎస్టీయూ నేతలు, ఉపాధ్యాయులు

రాయచోటి అర్బన్ : ప్రభుత్వ పాఠశాలల పనివేళల పెంపు నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని ఎస్టీయూ అన్నమయ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అంకం శివారెడ్డి, పి.మధుసూదన, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కడిమాల మురళి డిమాండ్ చేశారు. గురువారం జిల్లాలోని పలు మండలాల్లోని పాఠశాలలను సందర్శించి ఎస్టీయూ సభ్యత్వ నమోదు చేపట్టారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్నత పాఠశాలల పనివేళలను సాయంత్రం 5 గంటల వరకు పొడిగించాలన్న నిర్ణయాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. పాఠశాలల పనివేళలను 5 గంటలకు ముగిస్తే పిల్లలు ఇంటికి చేరే సమయానికి చీకటి పడుతుందని వివరించారు. విద్యార్థుల భద్రత అంశంపై ప్రభు త్వం ఆలోచించాలని కోరారు. ముఖ్యంగా బాలికలు ఎక్కువ మంది చదువు మానేసే పరిస్థితి ఉంటుందన్నారు. ప్రభుత్వం ఈ విషయంపై ఆలోచించి పనివేళల పెంపుపై నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించు కోవాలంటూ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర కమిటీ కన్వీనర్ సుబ్బారెడ్డి, జిల్లా నేతలు నరసింహులు, సి.వి. రమణ, మధుకర్‌రెడ్డి, హరీష్, వెంకటేశ్వర్లు, ఖాదర్‌వలీ, శ్రీనివాసులు రెడ్డి, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ఎలా బతకాలి..?

ఉన్నఫళంగా ఉద్యోగం పోతే ఎలా..



ఐదు సంవత్సరాలుగా ఏపీఎండీసీలో అటెండర్‌గా చిమకుర్తి మైనింగ్‌లో విధులు నిర్వహిస్తున్నా. నన్ను కొత్త ప్రభుత్వం ఉన్నఫలంగా ఉద్యోగం నుంచి తీసివేస్తే నేను, నా కుటుంబం ఎలా బతకాలి. ఉద్యోగాన్ని నమ్ముకొని కుటుంబాన్ని పోషిస్తున్నా. నా పిల్లల చదువులు ఏమవుతాయో అన్న భయం పట్టుకొంది. ప్రభుత్వం పేదల కష్టాలను దృష్టిలో ఉంచుకుని మా ఉద్యోగాన్ని కొనసాగించాలి. -గగ్గుటూరి బాబాఫక్రుద్దీన్, మంగంపేట, ఓబులవారిపల్లి

భవిష్యత్ అంధకారంగా మారింది



గత ప్రభుత్వంలో విజయవాడలో ఏపీఎండీసీ కార్యాలయంలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తూ జీవనం సాగించేవాడిని. అయితే వచ్చిన కొత్త ప్రభుత్వం ఎటువంటి నోటీసులు, కారణాలు లేకుండా నాతో పాటు చాలా మందికి మీ ఉద్యోగాలు తీసి వేశాం అనడంతో మా భవిష్యత్ అంధకారంగా తయారయింది. ప్రభుత్వం మమ్మలను విధులలోకి తీసుకోవాలని కోరుతున్నాం.

- నరసింహులు, రెడ్డిపల్లి, పుల్లంపేట మండలం

ఈ ఆవేదన వీరిద్దరిదే కాదు. ఏపీఎండీసీలో పనిచేస్తూ కొత్త ప్రభుత్వం వచ్చాక ఉద్యాసనకు గురైన చిరుద్యోగులందరిది.

సాక్షి రాయచోటి/ఓబులవారిపల్లె : కూటమి ప్రభుత్వం చిరుద్యోగుల మెడపై కత్తి కడుతోంది. ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి.. చిన్నపాటి ఉద్యోగాలను చేసుకుంటున్న వారిపై పంజా విసురుతోంది. ఏపీఎండీసీలో చిరుద్యోగులను ప్రభుత్వం తొలగించడంతో వారంతా దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. మేమెలా బతకాలి అంటూ తీవ్ర ఆవేదన చెందుతున్నారు.

ఏపీఎండీసీలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల తొలగింపు..

ఆంధ్రప్రదేశ్ మైనింగ్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎండీసీ) విభాగంలో పనిచేస్తున్న సుమారు 123 మంది ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులకు



ప్రభుత్వం తాజాగా ఉద్వాసన పలికింది. అన్నీ సక్రమంగా ఉన్నా కేవలం రాజకీయ కక్ష సాధింపులో భాగంగా పలువురిని ఈ సర్కార్ తొలగించింది. గతంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, అన్నమయ్య జిల్లా రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, వైఎస్సార్ జిల్లా కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, అన్నమయ్య జిల్లా కోడూరు ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు సిఫార్సులు చేశారని సాకులు చూపుతూ మైనింగ్ డిపార్టుమెంట్‌లో ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఉద్యోగులను తాజాగా తొలగించారు. రాష్ట్ర వ్యాప్తంగా 123 మందిని ఉద్యోగాల నుంచి తొలగించినా, అన్నమయ్య జిల్లాలోని మంగంపేట ప్రాజెక్టులో పనిచేస్తున్న తొమ్మిది మందితో పాటు మొత్తం రాష్ట్రంలో పనిచేస్తున్న వారిలో ఎక్కువ మంది చిత్తూరు, వైఎస్సార్, అన్నమయ్య జిల్లాలకు చెందిన వారే ఉన్నారు. వారంతా ఆవేదన చెందుతున్నారు.

సమాచారం ఇవ్వలేదు



చిన్నతనం నుంచి రెండు కాళ్లు పనిచేయవు. విద్యార్హతను బట్టి ఏపీఎండీసీలో ఏడాది కాలంగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం చేస్తున్నాను. ఎటువంటి సమాచారం లేకుండా నన్ను ఉద్యోగం నుంచి తొలగించారు. నేను చేసిన తప్పేమిటి. ఉద్యోగమే జీవనాధారంగా జీవిస్తున్న నాకు ఇక ఆధారం ఏమిటి. వెంటనే నాకు ఉద్యోగం కల్పించాలి.

-రుద్రాల సుధాకర్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగి, ఏపీఎండీసీ, మంగంపేట

ఉద్యోగులను తొలగించడం దారుణం..



ఏపీఎండీసీలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు 123 మందిని ఒకేసారి తొలగించడం దారుణం. దీంతో వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయి. కూటమి ప్రభుత్వం కొత్త ఉద్యోగాలను కల్పిస్తామని చెప్పి ఉన్నవి తొలగించడం పెద్ద కుట్ర, ద్రోహంతో సమానం. ఇందుకు కూటమి ప్రభుత్వం సమాధానం చెప్పాలి.

- వత్తలూరు సాయికిషోర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు, ఓబులవారిపల్లి

ఉన్న ఉద్యోగాలు పీకేసే చంద్రబాబు.

కొత్త ఉద్యోగాలు ఇస్తారా..?



కొరముట్ల శ్రీనివాసులకు వినతి పత్రం ఇస్తున్న ఏపీఎండీసీలో తొలగించిన ఉద్యోగులు

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొరముట్ల

రైల్వేకోడూరు అర్బన్ : ఎన్నికలకు ముందు చంద్రబాబు , లోకేష్‌లు 25 లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తామని.. నిరుద్యోగులందరికీ భృతి ఇస్తామని చెప్పారని, కానీ అధికారంలోకి వచ్చాక ఉన్న ఉద్యోగాలు ఊడగొడుతూ యువకులకు ద్రోహం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, రైల్వేకోడూరు మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు ధ్వజమెత్తారు. ఏపీఎండీసీలో తొలగించబడిన ఉద్యోగులు గురువారం ఆయనను కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా కొరముట్ల మాట్లాడుతూ ఉన్న ఉద్యోగాలు తీసేసే సీఎం చంద్రబాబు కొత్త ఉద్యోగాలు ఇస్తారంటే ఎవరైనా నమ్ముతారా అని ప్రశ్నించారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన వెంటనే 2.25 లక్షల మందికి ఉద్యోగాలు ఇచ్చారని, ఎంతో మందికి ఉపాధి, ప్రజలకు సంక్షేమం అందించారని గుర్తు చేశారు. ఏపీఎండీసీలో స్థానికతకు ప్రాధాన్యం ఇస్తూ చదువుకొన్న 70 మంది యువతకు తాము ఉద్యోగాలు ఇస్తే చంద్రబాబు రాగానే ఎటువంటి నోటీసులు లేకుండా నియంతృత్వ పోకడ, రాజకీయ కక్షతో వారిని తీసేయడం దారుణమని వ్యాఖ్యానించారు. అలాగే అన్ని డిపార్ట్‌మెంట్లలో చిరుద్యోగులను తీసేయడం సబబు కాదన్నారు. రాజకీయాలలో ఇది మంచి పరిణామం కాదని, అధికారంలో శాశ్వతంగా మీరే ఉండరని గుర్తుంచుకోవాలన్నారు. అధికారం, ప్రభుత్వాలు మారినప్పుడల్లా ఇలా చేస్తే ఉద్యోగులు, యువతలో అభద్రతా భావం ఏర్పడుతుందన్నారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చామని గుర్తు పెట్టుకోవాలని కొరముట్ల అన్నారు. ఏపీఎండీసీలో తీసేసిన ఉద్యోగులను తిరిగి తీసుకోకుంటే విజయవాడ, మంగంపేటలలో ఆందోళనలు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సుబ్బరామరాజు, సీహెచ్ రమేష్, ఆర్వీ రమణ, జనార్దన్‌రాజు, తదితర నాయకులు పాల్గొన్నారు.

సమగ్ర వ్యవసాయ పథకం అమలుపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్రనాయక్

రాయచోటి : జిల్లాలో సమగ్ర వ్యవసాయ పథకం అమలుపై రైతులు దృష్టి సారించేలా అవగాహన సదస్సులను నిర్వహించాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి బి చంద్రనాయక్ సూచించారు. గురువారం రాయచోటిలోని జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో సహాయ వ్యవసాయ సంచాలకులు, అధికారులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో చంద్రనాయక్ మాట్లాడారు. వర్షాధార ప్రాంత అభివృద్ధి పథకం (ఆర్ఏడీ-2024-25) కింద సమగ్ర వ్యవసాయ వ్యవస్థ అమలు చేయు విధానంపై తెలిపారు. ఈ పథకంలో భాగంగా జిల్లాలో 16 మండలాలు ఎంపిక య్యాయన్నారు. ఆయా మండలాల్లోని 400 మంది రైతులను లక్ష్యంగా చేసుకొని పథకం అమలుపై దృష్టి సారించాలన్నారు. ప్రధానంగా సమగ్ర వ్యవసాయ వ్యవస్థ, ఇతర విభాగాల కింద సైలెజ్ యూనిట్, వర్మీ కంపోస్ట్ యూనిట్‌లను నిర్మించుకోవాలని సూచించారు. ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్ సిస్టమ్ కింద వ్యవసాయ పంటలైన రాగులు, కొర్రలు, నూనె గింజలు, ఉద్యాన పంటలలో మామిడి, అల్లనేరేడు, జామ సాగు చేయాలన్నారు. అలాగే ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు పెంచుకోవడానికి అవకాశం ఉందన్నారు. ఎంపిక చేసిన 16 మండలాల వ్యవసాయ అధికారులు లబ్ధిదారులను ఎంపిక చేసి వారికి పథకంపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు మజీద్ అహ్మద్, టెక్నికల్ వ్యవసాయ అధికారి రమేష్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి నిధులు వ్యవసాయానికి అనుసంధానం చేయాలి

వీరబల్లి : ఉపాధి హామీ పథకం నిధులు వ్యవసాయానికి అనుసంధానం చేయాలని ఫార్మర్స్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ చైర్మన్ రాజశేఖర్ రాజు తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉపాధి హామీ నిధులు దాదాపు పదివేల కోట్లు ఎన్డీఏ ప్రభుత్వం ఖర్చు పెట్టే పరిస్థితిలో ఉందన్నారు. అందులో నుంచి పదిశాతం వ్యవసాయ రంగానికి కేటాయిస్తే గ్రామాలు సస్యశ్యామలం అవుతాయన్నారు. ఈ విషయంపై ప్రభుత్వం ఆలోచించాలని కోరారు.

హై..హై..వాసు!

- కడప నగరంలో పెత్తనం చెలాయిస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు
- హోదా లేకపోయినా ప్రొటోకాల్ పాటిస్తున్న పోలీసులు
- జనరల్ ఫండ్ రోడ్డు నిర్మాణానికి వాసుతో భూమి పూజ
- మేయర్, కార్పొరేటర్‌కు కనీస సమాచారం ఇవ్వని వైనం

సాక్షి ప్రతినిధి, కడప : కడప నగరంలో పోలీసు సైరన్ మోతలు అధికమ య్యాయి. అనధికార పెత్తనం ఎక్కువైంది. కార్పొరేషన్ యంత్రాంగం జీ..హుజూర్ అంటూ తలాడిస్తూ వెళుతున్నారు. జనరల్ ఫండ్ సైతం మేయర్, సంబంధిత కార్పొరేటర్‌కు తెలియకుండా మంజూరవుతోంది. పాలకమండలితో నిమిత్తం లేకుండా ఏకంగా భూమి పూజలు సైతం చేయిస్తున్నారు. ఈ మొత్తం వ్యవహారం టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి చుట్టూ తిరుగుతోంది. కలెక్టర్ వద్దకు వెళ్లడం విస్మరిస్తారేమో కానీ, ప్రభుత్వ అధికారులు ఠంఛన్‌గా వాసు వద్దకు వెళ్లి కన్పిస్తున్న వైనమిది. టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డికి ఎలాంటి అధికారిక హోదా లేదు. ఆయన వాహనం నగరంలో బయలుదేరిందంటే ముందు వైపు పోలీసు జీపు వచ్చి చేరుతోంది. సైరన్ వేసుకుంటూ వెళ్తుంటే ఆ వెనుకే టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి వాహనం తర్వాత అనుచరుల వాహనశ్రేణి వెళుతోంది. తుదకు టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి వెళ్లినా పోలీసు జీపు సైరన్‌తో వెళ్తూ లేని ప్రొటోకాల్‌ను కల్పిస్తున్నారు. మొన్నటి వరకూ నిబంధనలను అనుసరించే పోలీసు యంత్రాంగం జిల్లా కేంద్రంలో విచ్చలవిడిగా ప్రవర్తిస్తోంది.

జీ.. హుజూర్ అంటున్న యంత్రాంగం..

ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులంతా భాగస్వాములు. ఆ వాస్తవాన్ని విస్మరించి అధికారులు ప్రవర్తిస్తున్నారు. టీడీపీ నాయకులు, ఆ పార్టీ ప్రజాప్రతినిధులు మాత్రమే ప్రభుత్వంలో భాగస్వాములన్నట్లుగా పలువురు వ్యవహరిస్తున్నారు. ఇలాంటి ధోరణి ప్రధానంగా కార్పొరేషన్ యంత్రాంగంలో అధికంగా కనిపిస్తోంది. పాలక మండలితో నిమిత్తం లేకుండా జనరల్ ఫండ్ వెచ్చింపులో సైతం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. బుధవారం కడపలోని 20వ డివిజన్‌లో విశ్వేశ్వరయ్య సర్కిల్ నుంచి ప్రకాష్‌నగర్ వెళ్లే రహదారి ఏర్పాటుకు రూ.15లక్షలతో సీసీ రోడ్డు నిర్మించేందుకు భూమి పూజ చేశారు. ఈకార్యక్రమం టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి చేతుల మీదుగా చేపట్టారు. అసిస్టెంట్ కమిషనర్ రాకేష్, డీఈ వేణుగోపాల్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది దగ్గర ఉండి భూమి పూజ చేయించడం విశేషం. కాగా నగర పాలక మండలి నిధులతో చేపడుతున్న ఈ రోడ్డు నిర్మాణం గురించి స్థానిక కార్పొరేటర్, మేయర్ సురేష్‌బాబుకు కనీస సమాచారం లేదు. అదే విషయాన్ని కార్పొరేటర్ కమిషనర్ మనోజ్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. శ్రీనివాసులరెడ్డితో భూమి పూజ ఏ హోదాతో చేయించారు? కార్పొరేటర్‌గా నా హక్కులు హరించడం సమంజసమా? ఇలాంటి ప్రశ్నలకు అధికారుల వద్ద ఎలాంటి జవాబు లేదు. కాగా, శ్రీనివాసులరెడ్డితో భూమి పూజ చేయించడం అసిస్టెంట్ కమిషనర్ రాకేష్ స్వామిభక్తి ప్రదర్శించడమేనని పలువురు పేర్కొంటున్నారు.



కడపలోని ప్రకాష్‌నగర్ సిమెంట్ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న టీడీపీ నేత శ్రీనివాసులరెడ్డి

బడిగంటలు పెరిగాయి



మదనపల్లెలోని వివేకానంద మున్సిపల్ ఉన్నత పాఠశాల



తరగతి గదిలో విద్యార్థులు

- విద్యాశాఖలో ప్రభుత్వ అసంబద్ధ నిర్ణయాలు
- పనివేళల పెంపు నిర్ణయం సరికాదని సూచన
- ఈనెల 25 నుంచి ఎంపిక చేసిన పాఠశాలల్లో అమలు
- తిరోగమన విధానమంటూ ఉపాధ్యాయుల మండిపాటు



మదనపల్లె సిటీ : కొత్తగా వచ్చిన కూటమి ప్రభుత్వం ఐదు నెలల్లోనే విద్యాశాఖలో అశాస్త్రీయ నిర్ణయాలు తీసుకుంటూ తిరోగమన విధానాలకు శ్రీకారం చుడుతోందని ఉపాధ్యాయులు మండిపడుతున్నారు. బోధనా సిబ్బందికి చట్టబద్ధంగా సంక్రమించిన క్యాజువల్ లీవ్‌ల మంజూరులో నిబంధనలు సృష్టించడం, పాఠశాలల పని గంటలు పెంచడం, రెసిడెన్షియల్ శిక్షణ తదితర నిర్ణయాలను ఉపాధ్యాయులు, సంఘాల నాయకులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. పాఠశాలల పనివేళలు పెంచేందుకు పాఠశాల విద్యాశాఖ చర్యలు ప్రారంభించింది. ఇందులో భాగంగా జిల్లాలో 30 ఉన్నత పాఠశాలలను పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారు. ఈ పాఠశాలల్లో ఈనెల 25 నుంచి కొత్త టైమ్‌టేబుల్‌ను అమలు చేయనున్నారు. దీనిపై వచ్చే అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని జిల్లాలోని అన్ని పాఠశాలల్లో ఈ విధానాన్ని అమలు చేసేందుకు విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. విద్యార్థులు, తల్లిదండ్రులు, టీచర్ల అభిప్రాయాలను ఏ మాత్రం పట్టించుకోకుండా ప్రభుత్వం ఒంటెద్దు పోకడలతో తీసుకున్న నిర్ణయాలపై ఉపాధ్యాయులు మండిపడుతున్నారు.

ఫస్ట్ పీరియడ్ 50 నిమిషాలు

ప్రస్తుతం పాఠశాలల పనివేళలు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కాగా, కొత్త టైమ్ టేబుల్ ప్రకారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పని చేస్తాయి. ఉదయం, మధ్యాహ్నం ఇచ్చే బ్రేక్ సమయాన్ని 5 నిమిషాల చొప్పున, భోజన విరామ సమయాన్ని 15 నిమిషాలు పెంచారు. ఉదయం మొదటి పీరియడ్‌ను 50 నిమిషాలు చేశారు. ఆ తర్వాత 3 పీరియడ్లు ప్రస్తుతం 40 నిమిషాల చొప్పున ఉండగా వాటిని 45 నిమిషాలకు పెంచారు. మధ్యాహ్నం మొదటి పీరియడ్‌ను మార్చకుండా అనంతరం 3 పీరియడ్లను 45 నిమిషాలకు పెంచారు. ఈ మార్పు కారణంగా రోజులో పాఠశాలల సమయం గంట పెరగనుంది. కొత్త పనివేళలపై ఉపాధ్యాయ సంఘాల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

కొత్త టైమ్ టేబుల్ ఇదే	
ఫస్ట్ బెల్	9 గంటలకు
సెకండ్ బెల్	9.05
స్కూల్ అసెంబ్లీ	9.05 నుంచి 9.25
మొదటి పీరియడ్	9.25 నుంచి 10.15
2వ పీరియడ్	10.15 నుంచి 11.00
బ్రేక్	11.00 నుంచి 11.15
3వ పీరియడ్	11.15 నుంచి 12.00
4వ పీరియడ్	12.00 నుంచి 12.45
లంచ్ బ్రేక్	12.45 నుంచి 1.45
5వ పీరియడ్	1.45 నుంచి 2.30
6వ పీరియడ్	2.30 నుంచి 3.15
బ్రేక్	3.15 నుంచి 3.30
7వ పీరియడ్	3.30 నుంచి 4.15
8వ పీరియడ్	4.15 నుంచి 5.00

అశాస్త్రీయ నిర్ణయం



ఉన్నత పాఠశాలల పని వేళల పొడిగింపు అశాస్త్రీయం. పిల్లలు సంసిద్ధంగా ఉండరు. చాలా మంది పిల్లలు 3 నుంచి 4 కిలోమీటర్ల దూరం నుంచి పాఠశాలలకు వస్తుంటారు. ముఖ్యంగా అమ్మాయిలు వారి ఇంటికి చేరుకోవాలంటే చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. మహిళా ఉపాధ్యాయులు సైతం సాయంత్రం 5 గంటల తర్వాత ఇంటికి వెళ్లడం శ్రమతో కూడుకున్నదే. ప్రస్తుతమున్న వేళలు కొనసాగించాలి.

-పి.మధుసూదన్, ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి

ఆలోచన మంచిది కాదు



పాఠశాలల పని వేళల్లో మార్పు చేయాలనే ఆలోచన ప్రభుత్వానికి మంచిది కాదు. పల్లెల నుంచి ఉదయం 9 గంటలకు వచ్చిన విద్యార్థులు సాయంత్రం 4 గంటలకు బడి వదిలితే ఇంటికి 5 గంటలకు చేరుకుంటారు. అలా కాకుండా 5 గంటల వరకు ఉంటే ఇబ్బందులు పడతారు. పిల్లలపై తీవ్ర ఒత్తిడి పెరుగుతుంది.

-పి.వెంకటరమణ, యూటీఎఫ్, జిల్లా కార్యదర్శి

జిల్లాలో నూతన టైమ్ టేబుల్ అమలు చేయనున్న పాఠశాలలు

- జెడ్పీ ఉన్నత పాఠశాల (బాలురు), బి.కొత్తకోట
- ఏపీ మోడల్ స్కూల్, చిన్నమండ్యం
- జెడ్పీ ఉన్నత పాఠశాల ప్లస్, చిట్వేలి
- జెడ్పీ ఉన్నత పాఠశాల (బాలురు) గాలివీడు
- జెడ్పీ ఉన్నత పాఠశాల (తెలుగు) గుర్రంకొండ
- ఏపీ మోడల్ స్కూల్, కె.వి.పల్లి
- ఏపీ మోడల్ స్కూల్, కలకడ
- జెడ్పీ ప్లస్ ఉన్నత పాఠశాల (బాలికలు) కోడూరు
- జెడ్పీ ఉన్నత పాఠశాల, అంగళ్లు, (కురబలకోట)
- జెడ్పీ ఉన్నత పాఠశాల (బాలురు) లక్కిరెడ్డిపల్లె
- వివేకానంద మున్సిపల్ ఉన్నత పాఠశాల, మదనపల్లె
- కేజీబీవీ పాఠశాల, ములకలచెరువు
- జెడ్పీ ప్లస్ ఉన్నత పాఠశాల, నాగిరెడ్డిపల్లె (నందలూరు)
- జెడ్పీ ఉన్నత పాఠశాల (తెలుగు) నిమ్మనపల్లె
- జెడ్పీ ఉన్నత పాఠశాల, ఓబులవారిపల్లె
- జెడ్పీ ఉన్నత పాఠశాల, కలిచెర్ల (పెద్దమండ్యం)
- జెడ్పీ ఉన్నత పాఠశాల, బూర్లపల్లె, (పిటిఎం)
- ఏపీ మోడల్ స్కూల్, పెనగలూరు
- ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పీలేరు
- జెడ్పీ ఉన్నత పాఠశాల, కొత్తపేట (పుల్లంపేట)
- జెడ్పీ ఉన్నత పాఠశాల (బాలికలు) రాజంపేట
- ఏపీ మోడల్ స్కూల్, రామాపురం
- జెడ్పీ ఉన్నత పాఠశాల, చెంబకూరు (రామసముద్రం)
- ఏపీ మోడల్ స్కూల్, రాయచోటి
- జెడ్పీ ఉన్నత పాఠశాల, మోటుకట్ల (సంబేపల్లి)
- జెడ్పీ ఉన్నత పాఠశాల, టి.సుండుపల్లి
- జెడ్పీ ఉన్నత పాఠశాల, తంబళ్లపల్లె
- జెడ్పీ ఉన్నత పాఠశాల (బాలికలు), వాల్మీకిపురం
- జెడ్పీ ఉన్నత పాఠశాల, వీరబల్లి

క్లుప్తంగా

ద్విచక్రవాహనాలు ఢీకొని ముగ్గురికి గాయాలు

మదనపల్లె: ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొని ముగ్గురు వ్యక్తులు గాయపడిన సంఘటన గురువారం మదనపల్లె మండలంలో జరిగింది. అంకిశెట్టిపల్లెకు చెందిన మెకానిక్ సంతోష్ (40) తన భార్య సయ్యద్‌మా (38) కలిసి ద్విచక్రవాహనంలో మదనపల్లెకు వస్తుండగా, మార్గమధ్యంలో మరో ద్విచక్రవాహనంలో ముజమిల్ (18) వేగంగా వచ్చి ఢీకొన్నాడు. ప్రమాదంలో ముగ్గురు గాయపడగా గమనించిన స్థానికులు బాధితులను మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

ఇరువర్గాల ఘర్షణ

మదనపల్లె: ఇరువర్గాల ఘర్షణలో ముగ్గురు గాయపడిన సంఘటన గురువారం మదనపల్లె మండలంలో జరిగింది. అంకిశెట్టిపల్లెకు చెందిన రామచంద్ర భార్య గంగులమ్మ ఇంటికి వెళ్లే దారిలో అదే గ్రామానికి చెందిన వెంకటేశ్వర, శివరామ్ రాళ్లు వేశారు. ఈ విషయమై గంగులమ్మ వారిని ప్రశ్నించింది. దీంతో వారు గొడవకు దిగారు. గంగులమ్మకు మద్దతుగా ఆమె బంధువైన శ్రీనివాసులు (55), అతని కొడుకు బాలకృష్ణ (25) వచ్చి ప్రశ్నించారు. దీంతో వెంకటేశ్వర, శివరామ్ తమ మద్దతుదారులతో కలిసి దాడి చేశారు. దాడిలో గంగులమ్మ, శ్రీనివాసులు, బాలకృష్ణ గాయపడగా స్థానికులు బాధితులను మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తప్పిపోయిన బాలుడు అప్పగింత

మదనపల్లె: తల్లిదండ్రుల వద్దకు వెళ్లాలని ప్రయత్నించి తప్పిపోయిన బాలుడిని వన్‌టౌన్ సీఐ ఎరిసావలీ, హెడ్‌కానిస్టేబుల్ శివ గురువారం మేనమామ వద్దకు చేర్చారు. పట్టణంలోని అమ్మచెరువుమిట్టకు చెందిన రామమోహన్‌సింగ్ అతని అక్క కుమారులను పెంచుకుంటున్నాడు. కాగా అక్క సంజన, సతీష్ తిరుపతి విష్ణు నివాసం వద్ద ఉంటున్నారు. కాగా ఇటీవల పెద్ద అబ్బాయి తిరుపతిలోని తల్లిదండ్రుల వద్దకు వెళ్లిపోయాడు. దీంతో రెండవ అబ్బాయి చైతన్య (8) బుధవారం మేనమామ రామమోహన్‌సింగ్‌కు తెలియకుండా తిరుపతి వెళ్లేందుకు ఇంటి నుంచి వచ్చేశాడు. బాలుడు ఇంటి వద్ద కనిపించకపోవడంతో పలు చోట్ల వెతికారు. ఫలితం లేకపోవడంతో వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు బాలుడి ఆచూకీ కనిపెట్టి గురువారం స్టేషన్‌కు తీసుకువచ్చి మేనమామ రామమోహన్‌సింగ్‌కు అప్పగించారు.

అగ్రహారం సంఘమిత్రపై ఫిర్యాదు

నిమ్మనపల్లె: డ్వాక్రా గ్రూపులకు తెలియకుండా సంఘమిత్ర శ్రీనిధి నగదును బ్యాంకు నుంచి డ్రా చేసిందని ఎస్‌హెచ్‌జీ సభ్యులు గురువారం అగ్రహారం సంఘమిత్ర విజయలక్ష్మిపై ఎంపీడీఓ, ఇండియన్ బ్యాంకు అధికారులకు ఫిర్యాదు చేశారు. అగ్రహారం వీఓ పరిధిలో ఉమామహేశ్వరి స్వయం సహాయక సంఘం నడుస్తోంది. ఈ సంఘంలో ఒకటవ లీడరుగా ఎం.ప్రమీల, రెండవ లీడరుగా పి.రమణమ్మ ఉండగా మరో ఎనిమిది మంది సభ్యులు ఉన్నారు. ఇటీవల శ్రీనిధి నుంచి రూ.50 వేలు గ్రూపు సభ్యులు అర్హత సాధించారు. సంఘమిత్ర విజయలక్ష్మి సంఘ తీర్మాణ ప్రతిలో గ్రూపు ఒకటవ లీడరు ప్రమీల, సభ్యులు ఎం.రాణెమ్మ, కె.రామలక్ష్మి, పి.లక్ష్మీదేవి తదితరుల సంతకాలను తీసుకోకుండా, ఆమె తీర్మాణం కాపీలో సంతకాలు చేసి నిబంధనలకు విరుద్ధంగా రూ.50 వేలు శ్రీనిధి నగదును బ్యాంకు నుంచి తనకు అనుకూలమైన మరో సభ్యురాలికి అందజేసింది. దీంతో సంఘమిత్రపై చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరారు.

రూ. 20 లక్షల నగదు, నగలు చోరీ

గౌనివారిపల్లెలో పట్టపగలే ఘటన

కురబలకోట: మదనపల్లె–అంగళ్లు మార్గమధ్యంలోని గౌనివారిపల్లెలో హైవే పక్కన ఉన్న ఎం.సుబ్బారెడ్డి ఇంటిలో గురువారం మధ్యాహ్నం 155 గ్రాముల బంగారు నగలు, రూ. 10 లక్షల నగదు చోరీకి గురయ్యాయి. బాధిత కుటుంబీకుల కథనం మేరకు.. ఎం. సుబ్బారెడ్డి రైతు. ఇతనికి హైవే పక్కన ఇల్లు ఉంది. గురువారం ఇంటికి తాళం వేసి ఇంటి వాళ్లంతా వ్యవసాయ పనులకు వెళ్లారు. మధ్యాహ్నం మాత్రలు మింగడానికి సుబ్బారెడ్డి ఇంటికి వచ్చాడు. ఇంటి మెయిన్ గేటు తీసి ఉండడం, ఇంటి తలుపు కూడా తెరవబడి ఉండడంతో అనుమానం వచ్చి లోనికి వెళ్లి చూశాడు. బీరువాలు పగుల గొట్టి అందులోని రూ.10 లక్షల నగదు. 155 గ్రాముల దాకా ఉన్న మూడు బంగారు చైన్లు, టీకా చైను, ఐదు ఉంగరాలు, జత కమ్మలు చోరీకి గురైనట్లు బాధిత కుటుంబీకులు తెలిపారు. కాగా నిత్యం రద్దీగా ఉండే హైవే పక్కన పట్టపగలే చోరీ జరగడం సంచలనంగా మారింది. ఇంత ధైర్యంగా చోరీ చేశారంటే ఈ ప్రాంతం గురించి తెలిసిన ముఠా పని అయి ఉంటుందని భావిస్తున్నారు. బాధితుడి భార్య ఎర్రమ్మ కాయకష్టం చేసి మరో వైపు సంతలకు వెళ్లి కూరగాయలు లాంటివి అమ్మి దాచుకున్న నగదు చోరీ కావడంతో ఆమె విలపించింది. రూరల్ సీఐ రమేష్, ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. వేలి ముద్రలు నిపుణులు, క్లూస్ టీమ్ నమూనాలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



గౌనివారిపల్లె చోరీపై బాధితుడు సుబ్బారెడ్డి ద్వారా వివరాలు తెలుసుకుంటున్న సీఐ



విలపిస్తున్న ఎర్రమ్మ

మతిస్థిమితం లేని మహిళ చెరువులో దూకి ఆత్మహత్య

మదనపల్లె: మతిస్థిమితం లేని మహిళ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మదనపల్లె పట్టణంలో గురువారం జరిగింది. కోటవీధికి చెందిన లక్ష్మిబాయి (54)ని భర్త గోవర్ధన్ పది సంవత్సరాల క్రితమే వదిలి వెళ్లిపోయాడు. ఆమెకు కుమార్తె, కుమారుడు ఉండగా కుమార్తెకు వివాహం చేసింది. కుమారుడు వ్యసనాలకు బానిసయ్యాడు. కాగా, గత కొన్ని నెలలుగా లక్ష్మిబాయి అనారోగ్యానికి గురైంది. ఈ నేపథ్యంలో మానసిక రుగ్మతకు లోనై మతిస్థిమితం కోల్పోయింది. ఈ క్రమంలో గురువారం ఉదయం ఆమె కోమటివానిచెరువు కట్టపై వెళుతూ ఒక్కసారిగా అందరూ చూస్తుండగానే చెరువులోకి దూకేసింది. వాకింగ్‌కు వచ్చినవారు కాపాడేందుకు ప్రయత్నం చేయగా వీలుకాకపోవడంతో వెంటనే టు టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి పోలీసులు చేరుకుని ఆమె మృతదేహాన్ని వెలికితీసి జిల్లా ఆస్పత్రి మార్చురీ గదికి తరలించారు. మహిళ కోమటివానిచెరువులో దూకిన విషయం సామాజిక మాధ్యమాల్లో వైరల్ కాగా సాయంత్రం మృతురాలి సోదరి టు టౌన్ పోలీసు స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు టు టౌన్ సీఐ రామచంద్ర తెలిపారు.


రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

చిట్వేలి: చిట్వేలి–రాపూరు ప్రధాన రహదారి, గట్టుమీదపల్లి క్రాస్ రోడ్డు సమీపంలోని పాలకేంద్రం వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యాకసిరి పెంచలమ్మ (45) మృతి చెందింది. పోలీసుల వివరాల మేరకు గురువారం సాయంత్రం 6.30 గంటల సమయంలో పెనగలూరు మండలం, కట్టావారిపల్లికి చెందిన ఎల్లంపల్లి సుబ్రమణ్యం తన భార్య గంగాదేవి, ఎం.రాచపల్లికి ఎస్టీ కాలనీకి చెందిన పెంచలమ్మతో కలిసి టీవీఎస్ మోపెడ్‌లో రాజంపేట వైపు వెళ్తుండగా అదే సమయంలో రాపూరు వైపు వెళ్తున్న లారీ ఢీ కొంది. లారీ టైరు పెంచలమ్మ తలపై ఎక్కడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పెంచలమ్మ

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా



నిబంధనలను ఉల్లంఘించి ఇసుక క్వారీలోకి చొరబడుతున్న ట్రాక్టర్లు



రాత్రివేళ ట్రాక్టర్లలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న దృశ్యం

నిబంధనలు తుంగలో తొక్కుతున్న వైనం

ఒంటిమిట్ట: ఉచిత ఇసుక రవాణా పథకం కొంతమంది అక్రమార్కులకు కాసులు కురిపిస్తోంది. ఒంటిమిట్ట మండల పరిధిలోని గొల్లపల్లి ఇసుక క్వారీలో ప్రభుత్వ నిబంధనలను క్వారీ గుత్తేదారులు, అక్రమ రవాణాదారులు తుంగలో తొక్కుతున్నారు. దొరికిన కాడికి దోచుకునే విధంగా ఇష్టారాజ్యంగా అక్రమ ఇసుక రవాణా జరుగుతోంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇసుక క్వారీలో ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు రవాణా చేసేందుకు అనుమతులు ఉన్నాయి. వాటికి విరుద్ధంగా రాత్రివేళ కొంతమంది అక్రమ ఇసుక రవాణా దారులు క్వారీ గుత్తేదారుల సహాయంతో నేరుగా పెన్నా నదిలోకి చొరబడి వందల ట్రాక్టర్లు ఇసుక రవాణా చేస్తున్నారు. ఇదేంటని అడిగితే తమ దగ్గర రశీదులు ఉన్నాయని, తమకు అనుమతి ఉందంటూ బుకాయిస్తున్నారు. గ్రామస్తులేమో 20వ తేదీ గొల్లపల్లి క్వారీలో అక్రమ ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లను హిటాచీ అడ్డుపెట్టి నియంత్రించిన కాంట్రాక్టర్ నేడు ఎందుకు అడ్డగించలేదని, ఆయనకు ఏమన్నా ముడుపులు ముట్టాయా అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటారో లేక అక్రమ రవాణాదారులకు వత్తాసు పలుకుతారో వేచి చూడాలి.

తప్పుడు ధ్రువపత్రాల జారీపై చర్యలు తీసుకోవాలి

రాయచోటి అర్బన్: జిల్లాలోని బి.కొత్తకోట మండలం గోళ్లపల్లె రెవెన్యూ గ్రామం సర్వే నంబర్ 427 బీ2బిలో 2.27 ఎకరాల భూమి విషయంలో తప్పుడు ధ్రువపత్రాలను సృష్టించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు జిల్లా జాయింట్ కలెక్టర్‌కు విన్నవించారు. హరిజనవాడకు చెందిన పోతగాళ్ల వీరప్ప, రమణప్ప, వెంకటరమణ, వేమన్నలకు సర్వేనంబర్ 427 బి2బిలో 2.27 ఎకరాల భూమిపై అన్ని రకాల హక్కులు, రికార్డులు ఉన్నాయన్నారు. కాగా అదే గ్రామానికి పెద్ద కోనప్ప, చిన్న కోనప్ప, అలివేలమ్మ, వెంకటేశ్వర, శేఖర, శివలతో పాటు మరికొందరు ఈ భూమి తమదంటూ దౌర్జన్యంగా ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు.

నకిలీ పత్రాలతో ఆక్రమణకు యత్నం

రాయచోటి టౌన్: రాయచోటి పట్టణ పరిధిలోని సుద్దలవాండ్లపల్లె రోడ్డు సమీపం బిజిలీ గుట్ట దగ్గర అయ్యప్ప స్వామి ఆలయాన్ని నిర్మించుకున్న స్థలం తమదేనంటే కొంత మంది ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని డిప్యూటీ తహసీల్దార్ సైకం వంశీకి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గురువారం ఆయనకు వినతిపత్రం అందజేశారు. సమగ్ర విచారణ తమకు న్యాయం చేయాలని కోరారు.

మధ్యవర్తులను నమ్మి మోసపోకండి

- మదనపల్లె ఆర్టీఓ ఎ.ప్రతాపరావు



మదనపల్లె:రవాణాశాఖకు సంబంధించిన సేవలకు, ఇతర పనులకు ప్రజలు దళారులను, మధ్యవర్తులను సంప్రదించి మోసపోవద్దని, ఏ సమస్య ఉన్నా నేరుగా కార్యాలయంలోకి వచ్చి పరిష్కరించుకోవచ్చని మదనపల్లె ప్రాంతీయ రవాణాశాఖ అధికారి(ఆర్టీఓ) ఎ.ప్రతాపరావు తెలిపారు. గురువారం ఆర్టీఏ కార్యాలయం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో మదనపల్లె యూనిట్ ఆఫీస్, ప్రాంతీయ రవాణా కార్యాలయంగా అప్‌డేట్ అయిందన్నారు. రవాణాశాఖకు సంబంధించిన ఆన్‌లైన్ వ్యవహారాలు, ఇతర పనుల్లో సమస్య ఉంటే కార్యాలయానికి వచ్చి తెలిపితే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. స్థానికంగా పరిష్కారం కాని టెక్నికల్ సమస్య అయితే, హెడ్ ఆఫీస్‌కు తెలిపి పరిష్కరిస్తామన్నారు.

చోరీ కేసులో నిందితుల అరెస్టు

17 కిలోల వెండి, 130 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం



నిందితుల అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

రాయచోటి టౌన్: సుండుపల్లి మండలంలోని మూడు వేర్వేరు ప్రదేశాలలో బంగారు, వెండి ఆభరణాల చోరీ సంఘటనకు సంబంధించి ఇద్దరు నిందితులను అరెస్టు చేసి వారివద్ద నుంచి బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు రాయచోటి డీఎస్పీ ఎంఆర్ కృష్ణ మోహన్ తెలిపారు. ఈ మేరకు గురువారం రాయచోటి రూరల్ సర్కిల్ పోలీస్ స్టేషన్‌లో మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 18వ తేదీ సుండుపల్లె మండల కేంద్రంలోని పద్మరాజు నగర్‌లో ఒక ఇంటిలో, అదే పట్టణంలోని సాయి నగర్‌లోని ఇళ్లలో చోరీ జరిగింది. అలాగే అదే నెల 31వ తేదీ సుండుపల్లె బస్టాండ్ సమీపంలో ఆర్ఎస్ జ్యువలరీ షాపులో చోరీ జరిగినట్లు ఫిర్యాదులు అందాయి. వీటిపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా నిందితులు వైఎస్సార్ జిల్లా అట్లూరు మండలం చలంగారిపల్లె గ్రామానికి చెందిన గుమ్మాల వెంకటసుబ్బయ్య, అన్నమయ్య జిల్లా, రాజంపేట మండలం అత్తిరాళ్ల గ్రామానికి చెందిన గొర్ల కుమార్ అలియాస్ అమర్ రాజ్ కుమార్‌లు ఇద్దరు నిందితులని వేలిముద్రల నిపుణుల ద్వారా తెలిసింది. వారి కోసం గాలిస్తున్న సమయంలో వీరు ఇద్దరు వైఎస్సార్ జిల్లా సిద్ధవటం పోలీస్ స్టేషన్ పరిధిలో రిమాండులో ఉన్నట్లు తెలిసింది. అక్కడి కోర్టు అనుమతితో అదుపులోకి తీసుకొని విచారించారు. ఇద్దరు దోచుకెళ్లిన వెండి, బంగారు ఆభరణాలు సుండుపల్లె మండల సమీపంలోని రాచవాండ్లపల్లె వద్ద ఉన్న సబ్ స్టేషన్ సమీపంలోని అటవీ ప్రాంతంలో పాతి పెట్టినట్లు తెలిపారు. అక్కడికి రూరల్ సీఐ వరప్రసాద్, సీసీఎస్ సీఐ చంద్రశేఖర్, ఎస్ఐలు రామకృష్ణారెడ్డిలు ఆ ప్రాంతానికి వెళ్లి దాచిపెట్టిన ఆభరణాలను తవ్వి తీయించారు. అక్కడ 17 కిలోల వెండి ఆభరణాలు, 130 గ్రాముల బంగారు ఆభరణాలను గుర్తించారు. వీటి విలువ సుమారు రూ.24లక్షల వరకు ఉంటుందని అంచనా వేశారు. నగలతో పాటు నిందితులను పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. నిందితులను రాయచోటి కోర్టులో హాజరుపరచనున్నట్లు వివరించారు.

హజ్‌యాత్రపై సత్యకుమార్ వ్యాఖ్యలు అభ్యంతరకరం

వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్



మదనపల్లె: రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్, హజ్‌యాత్రను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు ముస్లింల మనోభావాలు దెబ్బతీసేలా ఉన్నాయని, తక్షణమే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రంలో వైద్యకళాశాలల ఏర్పాటు అంశంపై శాసనమండలిలో కూటమి ప్రభుత్వాన్ని, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీలు ప్రశ్నిస్తే... వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్.. వంద ఎలుకలు తిన్న పిల్లి హజ్‌యాత్రకు వెళ్లినట్లుగా అంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. మంత్రి వ్యాఖ్యలు ఒక వర్గానికి చెందిన వ్యక్తుల మనస్సులు గాయపరిచేలా ఉన్నాయన్నారు. ప్రజాస్వామ్యంలో బాధ్యతాయుతమైన మంత్రి పదవిలో ఉన్న వ్యక్తి ఈ విధంగా మాట్లాడటం మంచి పద్ధతి కాదన్నారు. సత్యకుమార్ తాను మంత్రినన్న విషయం మరచిపోయి, బీజేపీ, ఆర్ఎస్ఎస్ కార్యకర్తగా మైనారిటీలను కించపరుస్తూ మాట్లాడటంపై తాము అభ్యంతరం వ్యక్తం చేస్తున్నామన్నారు. మంత్రి సత్యకుమార్ విద్యాభ్యాసం మదనపల్లెలోనే జరిగిందని, ఆయనకు ఇక్కడి ప్రాంతంతో విడదీయరాని అనుబంధం ఉందన్నారు. అలాంటి వ్యక్తి మదనపల్లెలో మెడికల్ కాలేజీ ఏర్పాటును స్వాగతించాల్సింది పోయి, అడ్డుకునేలా వ్యవహరించడం తగదన్నారు.

ప్రజా ద్రోహానికి నిదర్శనం రాష్ట్ర బడ్జెట్

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల



మాట్లాడుతున్న కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు అర్బన్: ఎన్నికల ముందు పేద, బడుగు, బలహీన వర్గాలు, మహిళలకు సూపర్‌సిక్స్ పేరుతో హామీలు ఇచ్చి ఓట్లు దండుకొని తీరా అధికారం వచ్చాక బడ్జెట్ కేటాయింపులు చూస్తే ప్రజా ద్రోహానికి నిదర్శనంగా ఉన్నాయని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు విమర్శించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాదికి ప్రవేశపెట్టిన బడ్జెట్ కేటాయింపులు చూస్తుంటే ముఖ్యమంత్రి చంద్రబాబు అబద్ధాలకోరు అని అర్థమవుతోందన్నారు. చంద్రబాబుకు పేద ప్రజల ఉసురు తగలక మానదన్నారు. విద్యుత్ చార్జీలు అధికంగా పెంచడం, నిత్యావసర ధరలు అధికమవడం, పాఠశాలలు, పోర్టులు ప్రైవేటుపరం చేయడమే కాకుండా గ్రామాల్లో టోల్‌గేట్‌లు పెట్టి దండుకోవాలని చూస్తున్నారని తెలిపారు. 6 నెలలు కావస్తున్నా ప్రజలకు ఇచ్చిన ఒక్కహామీ కూడా అమలు చేయలేదన్నారు.. అదే తమ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 100 రోజులలో హామీలు నెరవేర్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, మార్కెట్ చైర్మన్ సుబ్బరామరాజు, సీహెచ్ రమేష్, జనార్దన్‌రాజు, ఆర్వీ రమణ పాల్గొన్నారు.

సారా, అక్రమ మద్యం కట్టడికి కఠిన చర్యలు

ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జయరాజ్

మదనపల్లె: నాటుసారా, అక్రమ మద్యాన్ని అరికట్టేందుకు ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక దృష్టి సారించామని కడప, అన్నమయ్య జిల్లాల ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జయరాజ్ తెలిపారు. గురువారం పట్టణంలోని నక్కలదిన్నె తాండాలో నాటుసారా, అక్రమ మద్యాన్ని నిర్మూలించడంపై ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన డిప్యూటీ కమిషనర్ జయరాజ్ మాట్లాడుతూ.. సారా తాగడం వల్ల అనేక దుష్పలితాలు ఉన్నాయని, సారా విక్రయించడం ద్వారా కొన్ని కుటుంబాలు ఆర్థికంగా లబ్ధి పొందితే, వేల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. సమాజ శ్రేయస్సు, ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని నాటుసారా తయారీ, విక్రయాలు, అక్రమ మద్యం రవాణా మానుకోవాలన్నారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్ మాట్లాడుతూ నాటుసారా తయారీ, విక్రయాలు చేస్తే నాన్‌బెయిలబుల్ కేసుతో పాటు 8 ఏళ్లు శిక్ష అనుభవించాల్సి ఉంటుందన్నారు. ఎక్సైజ్ సీఐ భీమలింగ మాట్లాడారు. కార్యక్రమంలో వన్ టౌన్ సీఐ ఎరీషావలీ, డీటీ అస్లాంబాషా, ఎక్సైజ్ ఎస్ఐ డార్కస్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో తమిళనాడు వాసి మృతి

కలికిరి: విద్యుత్ షాక్‌కు గురై తమిళనాడు రాష్ట్రానికి చెందిన యువకుడు మృతి చెందిన సంఘటన కలికిరి మండల పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు... తమిళనాడు రాష్ట్రం కడలూర్ జిల్లా వేపూర్ తాలూకా పెరియనేసలూర్ గ్రామానికి చెందిన కె.మారిముత్తు(21) వరికోత యంత్రం డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో మండల పరిధిలోని చీకటిపల్లి గ్రామంలో బుధవారం వరికోత చేస్తుండగా యంత్రానికి చెట్ల కొమ్మలు తగలకుండా అమర్చిన ఇనుప పైపుకు 11 కేవీ విద్యుత్ లైన్ తగలడంతో మారిముత్తు షాక్‌కు గురై కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో మృతుని తల్లిదండ్రులు సంఘటనా స్థలానికి చేరుకుని గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని కలికిరి ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

కాలిన గాయాలతో ..

మదనపల్లె: భవన నిర్మాణ పనులు చేస్తూ కరెంటు షాక్‌కు గురైన కార్పెంటర్ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు టు టౌన్ సీఐ రామచంద్ర తెలిపారు. నిమ్మనపల్లె మండలం రాచవేటివారిపల్లి పంచాయతీ గొల్లపల్లికి చెందిన గుర్రప్ప కుమారుడు చెన్నకేశవ (25) కార్పెంటర్ పనులు చేసేవాడు. ఈ నెల 12వతేదీన మదనపల్లె పట్టణంలోని మునెప్పకాలనీలో బషీర్ ఇంటి నిర్మాణ పనులు చేసేందుకు వెళ్లాడు. ఇంటికి కిటికీ అమర్చుతుండగా ప్రమాదశాత్తు విద్యుత్‌లైన్ తాకి షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన ఇంటి యజమాని బాధితుడిని వెంటనే ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. సమాచారాన్ని కుటుంబ సభ్యులకు తెలిపారు. చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం బాధితుడిని తిరుపతికి రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. గురువారం టుటౌన్ ఏఎస్ఐ రమణ ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

వల్లూరు (చింతకొమ్మదిన్నె): చింతకొమ్మదిన్నె మండల పరిధిలోని బుసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన గజ్జల ఓబుల్‌రెడ్డి (54) గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు చింతకొమ్మదిన్నె పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు... ఓబుల్ రెడ్డి గత పది సంవత్సరాల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. నయం కాకపోవడంతో ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకుని ఈనెల 18వ తేదీ రాత్రి 7 గంటల సమయంలో ఇంటి వద్దనే గడ్డి మందు తాగాడు. వేలూరు సీఎంసీ హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

అంతా రహస్యం!

- సోదాల్లో లెక్కలు లేని బంగారం స్వాధీనం?
- చిన్న సమాచారం కూడా లీక్ కాని వైనం

బి.కొత్తకోట: బి.కొత్తకోటలోని బంగారు దుకాణాలపై బుధవారం జరిగిన సోదాల సమాచారం రహస్యంగా మిగిలిపోయింది. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు తీరిక లేకుండా వాణిజ్య పన్నుల శాఖ అధికారులు ఈ సోదాలు నిర్వహించారు. కడప, మదనపల్లె, తిరుపతి నుంచి వచ్చిన ఐదు అధికారుల బృందాలకు కడప డిప్యూటీ కమిషనర్ సుబ్బారెడ్డి నేతృత్వం వహించారు. గతంలో ఒక్కసారి కూడా బంగారు దుకాణాలపై దాడులు జరగలేదు. తొలిసారిగా నిర్వహించిన సోదాలతో బి.కొత్తకోటలో కలకలం రేగింది. ఎంపిక చేసిన బంగారు దుకాణాలపైనే అధికారులు దాడులు చేసినట్లు తెలుస్తోంది. దాడులు చేసిన దుకాణాల కంటే అధిక వ్యాపారం కలిగిన దుకాణాలు ఇక్కడ ఉన్నాయి. అయితే వాటిపై దాడులు జరపలేదు. దీన్ని బట్టి వాణిజ్య పన్నుల శాఖ అధికారులు తమకు ఏ దుకాణాలపై ఫిర్యాదులు అందాయో వాటిలో సోదాలు నిర్వహించినట్లు స్పష్టమవుతోంది. షాపులతోపాటు వారి ఇళ్లల్లోనూ విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ సోదాలపై మీడియా ప్రతినిధులు పలుమార్లు వివరాల కోసం ప్రయత్నించినప్పటికీ సోదాలు ముగిశాక వివరాలు వెల్లడిస్తామని అధికారులు చెప్పారు. అయితే చిన్న సమాచారం కూడా చెప్పకుండా అధికార బృందాలు వెనుతిరిగి వెళ్లిపోయాయి. కాగా సోదాల్లో బంగారం, విలువైన సమాచారం లభ్యమైనట్లు ప్రచారం జరుగుతోంది. వాటి విలువ ఎంత, వాటికి రశీదులు ఉన్నాయా లేవా, కొనుగోలు చేశారా లేక రశీదులు లేకుండా కొన్నారా అన్నది బయటికి పొక్క లేదు. అలాగే కొన్నేళ్లుగా దుకాణదారులు నిర్వహించిన బంగారు నగల వ్యాపార లావాదేవీలకు సంబంధించిన రికార్డులు తీసుకెళ్లినట్లు సమాచారం. అధికారులు వెంట తీసుకువెళ్లిన వాటి వివరాలు సమగ్రంగా పరిశీలించి, లెక్కగట్టిన తర్వాత వివరాలు ప్రకటించే అవకాశం ఉందని వాణిజ్య పన్నుల శాఖ అధికారులు చెబుతున్నారు.

న్యాయవాదిపై దాడి చేసిన వారిని శిక్షించాలి



విధులను బహిష్కరించి నిరసన ప్రదర్శన చేస్తున్న రాయచోటి న్యాయవాదులు

రాయచోటి అర్బన్: తమిళనాడు రాష్ట్రం హోసూరుకు చెందిన న్యాయవాది కన్నన్‌పై దాడికి నిరసనగా రాయచోటికి చెందిన న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించారు. అనంతరం రాయచోటి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.ప్రభాకరరెడ్డి, కార్యదర్శి రెడ్డెయ్యలు విలేకరులతో మాట్లాడుతూ కోర్టు ఆవరణంలోనే న్యాయవాదిపై కొడవలితో దాడిచేసి హత్యచేసేందుకు ప్రయత్నించిన దంపతులు ఆనందన్, సత్యవతిలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. న్యాయవాదుల రక్షణకు తక్షణమే ప్రత్యేక చట్టాన్ని అమలులోకి తీసుకురావాలని భారత న్యాయవాదుల సంఘం (ఐఏఎల్) ఉమ్మడి కడప జిల్లా అధ్యక్షుడు టి.ఈశ్వర్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, సహాయ కార్యదర్శి డి.నాగముని, న్యాయవాదులు రవిశంకర్, నరసింహారెడ్డి, రామాంజనేయులు, రాజమనోహర్ తదితరులు పాల్గొన్నారు.

రాయచోటిలో ఎన్‌సీసీ యూనిట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు

రాయచోటి టౌన్: రాయచోటిలో ఎన్‌సీసీ యూనిట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని రాష్ట్ర రవాణా, క్రీడలు, యువజన శాఖ మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి కాకినాడ బెటాలియన్ కల్నల్ మోహన్ దాస్ అగర్వాల్‌కు సూచించారు. గురువారం విజయవాడలోని తన క్యాంప్ కార్యాలయంలో ఎన్‌సీసీ అధికారులను కలిశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువతలో నైపుణ్యం పెపొందించడానికి ఎన్‌సీసీ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో లెఫ్టినెంట్ కల్నల్ అనిల్‌కుమార్ మోహ్రా పాల్గొన్నారు.

కబ్జాదారుల నుంచి కాపాడాలి



జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

పీలేరు: గ్రామ పంచాయతీ సిబ్బందికి 2013లో ఇచ్చిన ఇంటి స్థలాలను కబ్జాదారుల నుంచి కాపాడాలని ఏపీ పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు వెంకటరామయ్య కోరారు. గురువారం జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో 83 మంది పారిశుద్ధ్య కార్మికులకు సర్వే నంబరు 1/16లో ఇంటి స్థలాలు మంజూరు చేశారన్నారు. గుట్టస్థలం కావడంతో చందాలు వేసుకుని చదును చేసుకున్నామని, అయితే కబ్జాదారులు ఆ స్థలాలను ఆక్రమించుకున్నారని తెలిపారు. అధికారులు స్పందించి తిరిగి తమ స్థలాలు ఇప్పించాలని కోరారు.